1 St
Happy Work Anniversary.
Year

షణ్ముఖి
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 21 మార్చి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు
VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-



# కేడర్‌లో ఉత్సాహం



- కేంద్ర పెద్దలతో తెలంగాణ బీజేపీ నేతల సమావేశం.. టార్గెట్ ఏంటంటే..
- కష్టపడితే తెలంగాణలో అధికారం సాధించవచ్చు
- స్థానిక ఎన్నికల్లో విజయం కోసం పాటించాల్సిన వ్యూహాలపై చర్చలు
- వరుస విజయాలు సాధిస్తుండడంతో బీజేపీ కేడర్ పూర్తి జోష్‌లో ఉంది
- ఇదే స్ఫూర్తితో పని చేస్తే తెలంగాణలో అధికారం కూడా సొంతమవుతుందనే భావనతో కేడర్ ఉత్సాహంగా..

హైదరాబాద్

ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో ఊహించని విజయాలు అందుకున్న బీజేపీ రాష్ట్ర నేతలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలుసుకున్నారు. ముందుగా నడ్డాతో అరగంట పాటు తెలంగాణ బీజేపీ నేతలు సమావేశమయ్యారు. తెలంగాణలో మంచి ఫలితాలు సాధించిన నేతలను నడ్డా అభినందించారు. ఇలాగే కష్టపడితే తెలంగాణలో అధికారం సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పార్లమెంట్ భవనంలో అమిత్‌షాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ఎంపీలు, నాయకులు కలిశారు ఇటీవల తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరపున విజయం సాధించిన మల్క కొమురయ్య, అంజిరెడ్డిని అమిత్ షా అభినందించారు. స్థానిక ఎన్నికల్లో విజయం కోసం పాటించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు. అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన సర్వే గురించి కూడా అమిత్ షా మాట్లాడారు. మనం బీసీ రిజర్వేషన్ వ్యతిరేకం కాదని, కానీ ఆ పేరుతో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని మాత్రం అడ్డుకోవాలని టీ-బీజేపీ నేతలకు అమిత్ షా సూచించారు. కష్టపడి పని చేసి రాబోయే ఎన్నికల్లో అధికారం సాధించాలని సూచించారు. వరుస విజయాలు సాధిస్తుండడంతో బీజేపీ కేడర్ పూర్తి జోష్‌లో ఉంది. ఇదే స్ఫూర్తితో పని చేస్తే తెలంగాణలో అధికారం కూడా సొంతమవుతుందనే భావనతో కేడర్ ఉత్సాహంగా పని చేస్తోంది. ఈ ఉత్సాహానికి తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు మరింత జోష్‌ను ఇచ్చాయి. కరీంనగర్‌లో వచ్చిన - మిగతా 2లో


# అదంతా దుష్ప్రచారం



- నా మీద ప్రజలకు కోపమా?
- కొలువుల పండగ కార్యక్రమంలో సీఎం రేవంత్
- గత పాలకులు పదేళ్లుగా ఈ నియామకాలు చేపట్టలేదు
- కానీ తమ ప్రభుత్వం కారుణ్య నియామకాల్ని చేపట్టింది
- నామీద వ్యతిరేకత వచ్చిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.
- ముఖ్యమంత్రి పదవి కంటే జెడ్పీటీసీగా గెలిచినప్పుడే ఆనందం కలిగింది: రేవంత్ రెడ్డి
- మొదటిసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ముఖ్యమంత్రి
- తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిదన్న రేవంత్ రెడ్డి
- నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని వ్యాఖ్య

హైదరాబాద్

నా మీద వ్యతిరేకత వచ్చిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి చేసినందుకే నాపై ప్రజలు కోపంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో కొలువుల పండగ కార్యక్రమం నిర్వహించింది. పంచాయితీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖలో కార్యుణ నియామకాల్ని చేపట్టింది. ఎంపికైన 922 మందికి కారుణ్య నియామక పత్రాలు అందించింది. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. గత పాలకులు పదేళ్లుగా ఈ నియామకాలు చేపట్టలేదు. కానీ తమ ప్రభుత్వం కారుణ్య నియామకాల్ని చేపట్టింది. నామీద వ్యతిరేకత వచ్చిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలు నాపై కోపంగా ఎందుకు ఉంటారు? మహిళలకు ఉచిత బస్సు కల్పించినందుకా? నాపై కోపం..? ఉద్యోగాలు ఇచ్చినందుకా - మిగతా 2లో



# మావోలకు గట్టి ఎదురుదెబ్బ

- ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మృతి
- మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య నిరంతర కాల్పులు
- ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు పద్దెనిమిది మంది నక్సలైట్ల మృతదేహాల స్వాధీనం

## ప్రపంచ పర్యాటకులను
# ఆకర్షించేలా..

- తెలంగాణ గురించి ప్రపంచానికి చాటి చెప్పేలా మిస్ వరల్డ్ పోటీలు
- మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి అందాల భామలు వస్తారు
- తెలంగాణ గురించి ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇది మంచి అవకాశం
- ఈ పోటీల్లో పాల్గొనే వారితో పాటు వేలాది మంది దేశ విదేశాలకు చెందిన వారు తెలంగాణకు వస్తారు
- మహిళల అంతః సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశం
- మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్

హైదరాబాద్ వేదికగా 72వ అంతర్జాతీయ మిస్ వరల్డ్ పోటీలు జరుగనున్నాయి. మే 7వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ అందాల పోటీల్లో సుమారు 140 దేశాలకు సంబంధించిన అందాల భామలు పాల్గొనను న్నారు. ఈక్రమంలో బేగంపేట్ టూరిజం ప్లాజాలో గురువారం మిస్ వరల్డ్ పోటీలకు చెందిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, టూరిజం సెక్రటరీ స్మితా సబర్వాల్, మిస్ వరల్డ్ - మిగతా 2లో



## ఎయిర్ లైన్స్‌లో
# ఇండిగో హవా

- 5 లక్షల చేరువలో ఎయిర్ ట్రాఫిక్
- మధ్య తరగతి ప్రజలను ఆకర్షించేందుకు ఎయిర్ లైన్స్ కంపెనీలు ప్రయత్నిస్తూనే ఉంటాయి.
- చాలా కంపెనీలు పలు రకాల వ్యూహాలను రచిస్తూనే ఉన్నాయి
- సంపన్న దేశాల మాదరి భారత్ లో ఎయిర్ లైన్స్ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు

## ప్రతి తెలంగాణ బిడ్డకు
# గుండె ధైర్యం ఈ గులాబీ జెండానే

- శూన్యం నుంచి సునామీ సృష్టించి తెలంగాణ సాధించిన మహా నాయకుడు కేసీఆర్
- వానపాములు కూడా నాగుపాముల్లా బుస కొడుతున్నాయి.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ సెటైర్లు
- అసూయ, ద్వేషం, ఆశ.. పార్టీ ఓటమిపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- ఏపీ కలిపి చూస్తే మన చరిత్ర సుదీర్ఘమైనది
- ఈ దేశంలో చాలా కాలం దశాబ్దాల పాటు తెలుగువారిని మద్రాసీలు



సూర్యాపేట

బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు.. 2001లో గులాబీ జెండా ఎగురవేసి ఒక్కడిగా బయల్దేరి శూన్యం నుంచి సునామీ సృష్టించి తెలంగాణ సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ కోసం రక్తం ధారపోస్తున్న అన్నదమ్ముళ్లకు, అక్కాచెల్లెళ్లకు హృదయపూర్వక వందనాలు. ఇది అరుదైన సందర్భం. తెలుగు రాజకీయాలు.. తెలంగాణ, ఏపీ కలిపి చూస్తే మన చరిత్ర సుదీర్ఘమైనది. ఈ దేశంలో చాలా కాలం దశాబ్దాల పాటు తెలుగువారిని మద్రాసీలు అని పిలిచేవారు. కానీ నందమూరి తారకరామారావు టీడీపీ స్థాపించి తెలుగువారి గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటారు. ఆ తర్వాత ఈ దేశంలో తెలంగాణ కంటూ ప్రత్యేక అస్తిత్ ఉందని, పౌరుషాల గడ్డ ఉన్నది అని ఎలుగెత్తి చాటిన నాయకుడు కేసీఆర్. - మిగతా 2లో



## నక్సల్స్‌కు అమిత్‌షా
# వార్నింగ్

- లొంగిపోయేందుకు మావోయిస్ట్‌లకు కేంద్రం అవకాశం ఇస్తుంది
- కాదు కూడదు అంటే వారి పట్ల కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది
- వచ్చేడాది మార్చి నెల లోపు నక్సలిజాన్ని అంతచేస్తాం

# ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా..

-మొదటిపేజీ తరువాయి

లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లీ, 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి అందాల భామలు వస్తారని తెలిపారు.

**ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా..**

తెలంగాణ గురించి ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇది మంచి అవకాశమని మంత్రి జూపల్లి కృష్ణారావు అభివర్ణించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారితో పాటు వేలాది మంది దేశ విదేశాలకు చెందిన వారు తెలంగాణకు వస్తారని అన్నారు. ఈ వేదిక వల్ల నిరంతరంగా పర్యాటక రంగానికి సంబంధించి రాబడి పెరుగుతుందని తెలిపారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించగలమని అన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.54 కోట్లు పెట్టుబడి పెట్టామని చెప్పారు. అందులో సగమే ప్రభుత్వం కేటాయిస్తుందని..మరో సగం ప్రమోటర్ల నుంచి సేకరిస్తామని స్పష్టం చేశారు. ఇది చరిత్రాత్మక కార్యక్రమమని.. సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవు అని వ్యాఖ్యానించారు. మహిళల అంతః సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశమని అన్నారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు.

తెలంగాణలో మహిళలకు అన్ని రంగాల్లో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యాటక అందాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పుకొచ్చారు. సౌత్ కొరియా స్క్విడ్ గేమ్, బీటీఎస్ బ్యాండ్ లాంటివి దేశ ఎకానమీకి ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ పేరు ప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచ స్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఈ అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు, రాజకీయ కోణంలో ఈ పోటీలను చూడటం సరికాదని మంత్రి జూపల్లి కృష్ణారావు హితవు పలికారు.



**భారతదేశానికి చాలా ప్రాధాన్యత ఉంది: క్రిస్టినా పిజ్కోవా**

బేగంపేట్ టూరిజం ప్లాజాలో ఇవాళ జరిగిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పాల్గొని సందడి చేశారు. నమస్తే ఇండియా అంటూ 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పలకరించింది. అతిథులు చాలా గొప్పగా స్వాగతం చెప్పారని అన్నారు. తన ప్రయాణంలో, తన హృదయంలో భారతదేశానికి చాలా ప్రాధాన్యత ఉందని తెలిపారు. భారత కల్చర్, ఆర్ట్స్ చాలా గొప్పగా ఉంటాయని వివరించారు. భారతదేశం చాలా ఇన్‌స్పైరింగ్ అని తెలిపారు. భారత్ విలువలను బోధిస్తుందని.. భిన్నత్వంలో ఏకత్వానికి ఎంతో గొప్ప భావన ఉందని చెప్పుకొచ్చారు. ఎన్నో భాషలు ఉన్నా అంత ఒక్కటిగా ఉండటం భారతదేశం స్ఫూర్తి అని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీలు కూడా అంతే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని చెప్పారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించడం మంచి అనుభూతిని ఇచ్చిందని క్రిస్టినా పిజ్కోవా పేర్కొన్నారు.

**తెలంగాణలో గొప్ప కట్టడాలు: స్మితా సభర్వాల్**

తెలంగాణ త్రిలింగ దేశంగా ప్రాముఖ్యత కలిగిందని సీనియర్ ఐఏఎస్, తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ తెలిపారు. ఈ ప్రాంతానికి 2500 ఏళ్ల చరిత్ర ఉందని ఉద్ఘాటించారు. రాష్ట్రం ఏర్పడిన 11 ఏళ్లలో ఎంతో వృద్ధి సాధించామని చెప్పారు. రామప్ప, వేయి స్థంభాల ఆలయం, చార్మినార్, గోల్కొండ కోట లాంటి ఎన్నో గొప్ప కట్టడాలు ఇక్కడ ఉన్నాయని అన్నారు. మే నెలలో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ సంస్కృతి ప్రతిభింబించేలా నిర్వహించనున్నామని చెప్పారు. మెడికల్ టూరిజంలో తెలంగాణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. సినిమా, ఆహార రంగాల్లో తెలంగాణకు పెట్టింది పేరని చెప్పారు. అత్యంత సురక్షిత పర్యాటక ప్రాంతం తెలంగాణ అని స్మితా సభర్వాల్ పేర్కొన్నారు.

# ప్రతి తెలంగాణ బిడ్డకు గుండె ధైర్యం ఈ గులాబీ జెండానే

-మొదటిపేజీ తరువాయి

ఎన్టీఆర్ పేరు ఎందుకు తీసుకున్నానంటే ప్రత్యేక సందర్భం ఉంది. రెండే రెండు పార్టీలు విజయవంతంగా 25 ఏండ్ల పైచిలుకు ప్రస్థానాన్ని కొనసాగించాయి. టీడీపీ, బీఆర్ఎస్ పార్టీ. తెలంగాణ ప్రజల గుండెల్లోంచి పుట్టిన పార్టీ గులాబీ పార్టీ అని కేటీఆర్ తెలిపారు. ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే 2001లో ఆనాడు కేసీఆర్ పార్టీ పెట్టినప్పుడు ఏమున్నది..? ఆయనకు 46 ఏండ్ల వయసు. ఒక రాజకీయ పార్టీ పెట్టాలంటే దుస్సాహసం ఉండాలి. నాడు వదేండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వం బీజేపీ ఒక వైపు ఉన్నారు. మూడో వైపు అదే ఎన్డీఏకు కన్వీనర్‌గా ఉంటూ ఏపీ ముఖ్యమంత్రిగా ఉంటూ.. ఢిల్లీలో చక్రం తిప్పుతూ చంద్రబాబు ఒక వైపు ఉన్నాడు. అదే మాదిరిగా తెలంగాణ అంశం 30 ఏండ్లు మరుగునపడ్డ అంశం. 1971లో తెలంగాణ ప్రజాసమితి అనే పార్టీ 11 ఎంపీలు గెలిచి మళ్లీ కాంగ్రెస్ పార్టీలో కలిపోయింది. తెలంగాణ ప్రజా సమితి కాంగ్రెస్‌లో విలీనం కావడంతో తెలంగాణ సమాజనికి నమ్మకం లేని పరిస్థితిలో 2001లో గులాబీ జెండా ఎగురేసి.. ఒక్కడిగా బయల్దేరి శూన్యం నుంచి సునామీ సృష్టించి తెలంగాణ సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ పేర్కొన్నారు.

**వానపాములు కూడా నాగుపాముల్లా బుస కొడుతున్నాయి**

రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భూమికి మూడు ఫీట్లు ఉన్నోడు కూడా అసెంబ్లీలో చాలాచాలా మాట్లాడుతున్నాడని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రేవంత్ రెడ్డి ఒక రాజకీయ పిగ్మి. కేసీఆర్ మోకాలి ఎత్తుకు సరిపోనోడు కూడా ఆహా ఓహో అని గర్జిస్తున్నాడు. గ్రామ సింహాలు కూడా సింహాల్లాగా ఎగురుతున్నాయి. వానపాములు కూడా నాగుపాముల్లాగా బుస కొడుతున్నాయి. అలాంటి పరిస్థితి రాష్ట్రంలో వచ్చింది. 2001లో గులాబీ జెండా ఎగురేసి.. ఒక్కడిగా బయల్దేరి శూన్యం నుంచి సునామీ సృష్టించి తెలంగాణ సాధించిన మహా నాయకుడు కేసీఆర్. ఇది ఏ రాజకీయ మరగుజ్జు ఔనన్నా కాదన్నా.. వానపాములు నాగుపాములై బుసకొట్టినట్టు యాక్టింగ్‌లు చేసినా కేసీఆర్ అనవాళ్లు చెరిపేస్తామని డైలాగులు కొట్టినా.. చరిత్ర చెరిపేయలేని సత్యం ఏదంటే కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం లేదు అనేది అక్షర సత్యం. ఎవరు ఔనన్నా కాదన్నా ఇది వాస్తవం. కేసీఆర్ వెంట ఎందరో నడిచారు. ఎందరో ఆత్మబలిదానాలు చేసుకున్నారు. చివరకు చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణను సాధించారు అని కేటీఆర్ తెలిపారు.



ప్రతి తెలంగాణ బిడ్డకు గుండె ధైర్యం ఈ గులాబీ జెండానే : కేటీఆర్

ప్రతి తెలంగాణ బిడ్డకు గుండె ధైర్యం ఈ గులాబీ జెండానే అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ రజోత్సవాల వేడుకల నేపథ్యంలో సూర్యాపేటలో ఏర్పాటు చేసిన పార్టీ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. టీఆర్ఎస్ పార్టీ ప్రారంభించిన సమయంలో కేసీఆర్‌కు మనీ పవర్ లేదు.. మజిల్ పవర్ లేదు.. కుల బలం లేదు.. ధన బలం లేదు.. మీడియా లేదు. ప్రతికూల శక్తులన్నీ హైదరాబాద్‌లో అడ్డా పెట్టి తొక్కి పారేస్తాం అని హుంకరింపులు. ఈరకమైన వాతావరణంలో ఒక్కడిగా బయల్దేరిన సమయంలో ఆయనకు కొందరు తోడుగా నిలిచారు. అలా ఒక్కొక్క అడుగేసుకుంటూ 14 ఏండ్ల శ్రమించి తెలంగాణను సాధించారు అని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మూడు ప్రాతల్లో విజయవంతమైంది. 14 ఏండ్లు ఉద్యమపార్టీగా విశ్వరూపం చూపించాం. ప్రజాస్వామ్యబద్ధంగా తమ కోరికలను ఎలా నెరవేర్చుకోవచ్చు అని చూపించాం. తెలంగాణ సాధించాం. ఆ తర్వాత పదేండ్ల పాటు ప్రజలు, రైతుల కోసం ఎలా పని చేయొచ్చు అని చేసి చూపించాం. అభివృద్ధిలో తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా నిలిపాం. 15 నెలల కిందట అధికారం పోయింది.. ప్రతిపక్షంలోకి వచ్చాం.. ఇక చిట్టి నాయుడు ఏం చెబుతున్నారు తనను బతకనిస్తలేరు అని అంటున్నాడు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరపున పోరాడుతున్న పార్టీ బీఆర్ఎస్ మాత్రమే. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతి తెలంగాణ బిడ్డకు గుండె ధైర్యం ఈ గులాబీ జెండా అని ఘంటాపథంగా చెప్పొచ్చు. ఈ గులాబీ జెండా ఎగిరి 24 ఏండ్లు నిండి 25వ ఏడాదిలోకి వచ్చే నెల 27న అడుగుపెట్టబోతున్నామని కేటీఆర్ తెలిపారు.

**అసూయ, ద్వేషం, ఆశ..**
**పార్టీ ఓటమిపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు**

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమికి అసూయ, ద్వేషం, ఆశ కారణమైనట్లు ఓ సింగర్ చెప్పినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మూడింటి వల్లే బీఆర్ఎస్ పార్టీ అనుకున్నన్ని సీట్లు సాధించలేకపోయిందని ఆ సింగర్ చెప్పారని కేటీఆర్ తెలిపారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మెడికల్ కాలేజీలు, దామరచర్ల విద్యుత్ ప్లాంట్, యాదాద్రి ఆలయంతో పాటు ఎన్నో ప్రాజెక్టులు నిర్మించాం కదా.. ఎందుకు ఓడిపోయామని ఓ సింగర్‌తో అంటే.. ఆయన ఇలా సమాధానం చెప్పారు. రామాయణంలో కట్టె, కొట్టె, తెచ్చె అన్నట్టు సింపుల్‌గా చెప్తా అని ఇలా చెప్పిండు.. బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడిపోవడానికి అసూయ, ద్వేషం, ఆశ పని చేశాయని చెప్పిండు. అసూయ అంటే అధికార పార్టీలోకి రాగానే ఎమ్మెల్యేలు కొత్త కారు, కొత్త ఇల్లు కట్టుకున్నాడని ప్రచారం చేశారు. ఇది వరకు అంగి లేకుండా తిరిగినట్టు ఇవాళ కొంత మంది నాయకులు కొత్త అంగి వేసుకున్నట్టు అసూయ పడ్డారు. మరో వైపు ద్వేషం..ఈ రాష్ట్రాన్ని కుటుంబం కోసం తెచ్చినట్టు.. దొర పాలన అని ప్రజల్లో ద్వేషం నిండే విధంగా అగ్ర నాయకత్వంపై ప్రచారం చేశారు. ఇక ఆశ.. కేసీఆర్ పదివేలు ఇస్తుండు.. నేను పదిహేను వేలు వేస్తా.. ఇద్దరికీ పెన్షన్లు ఇస్తా అని ఆశ పెట్టిండు. ఎతుల వెంకట్ రెడ్డి, కోతుల ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశలు పెట్టి మోసం చేశారు. కాంగ్రెసోడు, బీజేపోడు అభివృద్ధి గురించి మాట్లాడలేదు. మెడికల్ కాలేజీ, ఎస్పీ ఆఫీసు గురించి మాట్లాడలేదు. కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీల గురించి చెప్పలేదు. అసూయ, ద్వేషం, ఆశ నింపి ఓడగొట్టారు అని ఆ సింగర్ చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు.కేసీఆర్ హయాంలో భూముల ధరలు పెరిగాయి. దాంతో అందరి సంపద పెరిగింది. టీఆర్ఎస్ సంపద పెరగొద్దు.. కానీ కాంగ్రెస్, బీజేపీ సంపద పెరగాలట. కేసీఆర్ దొర అని యూట్యూబ్‌లో పనికిమాలిన చెత్త మాట్లాడి తిట్టని తిట్లు తిట్టి విషప్రచారం చేసి అధికారంలోకి వచ్చిండు. ఇవాళ అదే యూట్యూబ్ వాళ్లను గుడ్డలుడదీసి కొడుతాడట. ఆయన కాడికి వస్తే అన్ని గుర్తుకు వస్తున్నాయి. ఇదివరకు ఎవరికి భార్యాలు పిల్లలు లేరట. ఈయనకు మాత్రమే ఉన్నారట. నాయకులను నీచంగా వికృతంగా మాట్లాడి.. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిండు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# హైడ్రాకు హైకోర్టు తలంటు... పెద్దవాళ్లవి మీకు కనపించవా...

**హైదరబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం హైడ్రా వ్యవస్థను తీసుకొచ్చారు. ఇప్పటికే వందల అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. అయితే హైడ్రా పూర్తిగా పక్షపాతంగా వ్యవహరిస్తుందని.. డబ్బున్న బిల్డర్లను వదిలేసి పేదల ఇండ్లను కూల్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. పలు సందర్భాల్లో హైకోర్టు హైడ్రా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా మరోసారి హైడ్రాపై తెలంగాణ హైకోర్టు ఫైరయింది పేదలకు చెందిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో సరిపెట్టడం కాదని.. పెద్దల నిర్మాణాలను తాకి చూడాలని హైడ్రాను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. పేదలకు వర్తించే చట్టాలు పెద్దలకు వర్తించవా? అని నిలదీసింది. సంపన్నులకు ఏమైనా ప్రత్యేక చట్టాలున్నాయా అని ప్రశ్నించింది. రికివాడల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి పేపర్లలో ఫొటోలు వేయించుకోవడం కాదని.. సంపన్నులు ఉండే దుర్గం చెరువు, మియాపూర్ చెరువుల్లో ఆక్రమణలనూ తొలగించాలని.. అప్పుడే ప్రజాప్రయోజనాలను పరిరక్షించినట్ల వుతుందని అన్నారుహైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లోని పలు సర్వే నంబర్లలో ఉన్న 6.10 ఎకరాల స్థలానికి సంబంధించి అక్రమ నిర్మాణాలంటూ స్థానిక ఎమ్మార్వో జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ షామ్స్ ఫాతిమాఖాన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వక్ఫ్ బోర్డు సీఈవో రాసిన లేఖ ఆధారంగా వాల్టా చట్టం కింద ఎమ్మార్వో నోటీసులు జారీ చేయటం చెల్లదని పిటిషనర్ తరపు న్యాయ వాది వాదించారు. ప్రభుత్వ న్యాయవాది కలుగజేసుకొని.. మీరాలం చెరువు ఆక్రమణలపై ఇప్పటికే ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైందన్నారు. ఆ పిటిషన్‌లోని ఉత్తర్వుల ప్రకారం సదరు సర్వే నెంబర్లలోని ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.దీనిపై న్యాయమూర్తి జస్టిస్ భాస్కర్ రెడ్డి స్పందిస్తూ.. ఒకప్పుడు హైదరాబాద్ సిటీ ఆఫ్ లేక్స్‌గా ఉండేదని.. అప్పుడు 2,200 చెరువులుటే ప్రస్తుతం 180 కూడా లేవని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చెరువుల పరిరక్షణకు హైడ్రా చర్యలు తీసుకుంటోందని.. కాకపోతే మురికివాడల్లోని పేదల అక్రమ నిర్మాణాలనే కాకుండా పెద్దలు చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చాలని సూచించింది.

## కేడర్‌లో ఉత్సాహం

-మొదటిపేజీ తరువాయి

ఫలితాలతో తెలంగాణ రాష్ట్రం మొత్తం ఇదే వ్యూహంతో వెళ్లాలని బీజేపీ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇదే ఉత్సాహంతో స్థానిక ఎన్నికల్లో పనిచేసేలా బీజేపీ హై కమాండ్ దిగువ స్థాయి నేతలకు దిశానిర్దేశం చేస్తోంది. సర్పంచ్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ పోటీ చేయాలని బీజేపీ హై కమాండ్ భావిస్తోంది. ఈ మేరకు దిగువ స్థాయి నేతలతో అగ్ర నాయకులు సమావేశాలు నిర్వహిస్తున్నారు.

## అదంతా దుష్ప్రచారం

-మొదటిపేజీ తరువాయి

నాపై కోపం? రుణమాఫీ చేసినందుకా నాపై కోపం? 59వేల మంది ఉద్యోగాలు ఇచ్చినందుకా? నాపై కోపం అని ప్రశ్నించారు. అనంతరం, తెలిపారు. అనంతరం,బిల్డ్ నౌ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం కంటే జెడ్పీటీసీగా గెలిచినప్పుడే తనకు ఎక్కువ ఆనందం కలిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మొదటిసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 'ప్రజాపాలనలో కొలువుల పండుగ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కారుణ్య నియామకాలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వల్ల చాలామంది పదేళ్లు నష్టపోయారని ఆయన విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌తో పాటు కారుణ్య నియామకాలు కూడా ఇవ్వాల్సిందేనని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిదని ఆయన గుర్తు చేశారు. స్వరాష్ట్రం వచ్చినా నిరుద్యోగుల కల నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు, బడుగుబలహీన వర్గాల వారే పోటీ పరీక్షలకు సిద్ధమవుతారని ఆయన అన్నారు. నిరుద్యోగుల బాధలను ప్రజా ప్రభుత్వం గుర్తించిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అందుకే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలను ఇచ్చామని తెలిపారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని ఆయన అన్నారు. ఉద్యోగాలు ఇవ్వని వారికి ఓట్లు, ఉద్యోగాలు ఎందుకని యువత బీఆర్ఎస్‌ను ఓడించిందని అన్నారు. నిరుద్యోగుల బాధలు తనకు తెలుసని ఆయన అన్నారు. ఉద్యోగ ఖాళీలను పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించినట్లు చెప్పారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు వెల్లడించామని ఆయన అన్నారు.

## ఉగాది నుంచి రేషన్ పై సన్నబియ్యం

**హైదరాబాద్ :** రేషన్ కార్డు దారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త. రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం ఇచ్చేందుకు రేవంత్ ప్రభుత్వం రెడీ అయ్యింది. ఉగాది నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. అంతా అనుకున్నట్టు జరిగితే సూర్యాపేట జిల్లాలో సీఎం రేవంత్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించను న్నారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం లబ్దిదారులకు ఇస్తున్నారు. చాలా మంది నిరుపేదలు వాటినే తింటున్నారు. పండగలు లేదా బంధువులు వచ్చినప్పుడు సన్నబియ్యం కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో సన్న బియ్యం కేజీ రూ. 50 నుంచి రూ.75 మధ్య పలుకుతోంది. అంత డబ్బు పెట్టి కొనకుండా రేషన్ కార్డులపై ఉచితంగా సన్నబియ్యం ఇవ్వనుంది ప్రభుత్వం.ఒక్కో సభ్యుడికి 6 కేజీల చొప్పున ఎంతమంది ఉంటే అన్ని ఆరు కిలోలు సన్న బియ్యాన్ని ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని అన్ని రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఏప్రిల్ ఒకటి నుంచి ఇవ్వాలని భావిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాలు వెల్లడించాయి. గోదాముల్లో సన్నబియ్యం సిద్ధంగా ఉన్నట్లు అధికార అధికారులు తెలిపారు. ప్రస్తుతం నిల్వ ఉన్న బియ్యం రానున్న 4 నెలల కాలానికి నెలలకు సరిపోతాయని అంచనా వేస్తున్నారు. రేషన్‌కార్డు దారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్న బియ్యం తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 91,19,268 రేషన్ కార్డులు ఉన్నారు. 2,82,77,859 మంది లబ్ధిదారులు ఉన్నారు. కొద్దిరోజుల కిందట కొత్త రేషన్ కార్డులు పంపిణీని అంతా సిద్ధం చేశారు. వారికీ సన్న బియ్యం అందనుంది. కోటి 10 లక్షల మంది రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది రేవంత్ సర్కార్.ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి పౌర సరఫరాల శాఖ దాదాపు 53.95 లక్షల టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన వడ్లను మిల్లర్లకు అందజేశారు. అక్కడ కస్టమ్ మిల్లింగ్ రైస్ చేసి వాటిని గోదాముల్లో నిల్వ చేశారు. గతంలో కంటే ఈసారి కొనుగోలు కేంద్రాలకు సన్న వడ్లు అధికంగా వచ్చాయని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. సన్న, దొడ్డు వడ్లను వేర్వేరుగా నిల్వ చేసిన అధికారులు వాటిని మిల్లింగ్ చేయించారు.

## 61 లక్షల ట్రావెల్ అలవెన్స్



**హైదరబాద్ :** తెలంగాణ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ కు నోటీసులు ఇచ్చేందుకు జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సిద్ధమైంది. యూనివర్సిటీ నుంచి వాహన అద్దెకు తీసుకున్న నిధులపై అడిట్ విభాగం అభ్యంతరం తెలిపిది స్మితా సబర్వాల్ కు నోటీసులు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారని సమాచారం. సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌ను అద్దె కారు వివాదం చుట్టుముట్టింది. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్శిటికీ తన కారు అద్దె చెల్లింపు బిల్లులు పంపి డ్రా చేసుకున్నారని ఆడిట్‌లో తేలింది. కారుకు అద్దె పేరుతో యూనివర్శిటీ నుంచి రూ.61 లక్షల రూపాయలు బిల్లులు పెట్టి వసూలు చేసుకోవడంపై అభ్యంతరాలు మొదలయ్యాయి. ఇటీవల వర్శిటీలో నిధుల దుర్విని యోగం, అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపిస్తోంది. ఈ విచారణలో స్మితా సభర్వాల్ కు రూ.61 లక్షలు చెల్లించినట్లు గుర్తించారు అధికారులు.వాహన అద్దె కింద తీసుకున్న రూ.61 లక్షల నిధులను తిరిగి చెల్లించాలని మరో రెండ్రోజుల్లో ఆమెకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.2016 నుంచి 2024 వరకు సీఎంవో అదనపు కార్యదర్శిగా పనిచేసిన స్మితా సబర్వాల్ 90 నెలలకు గాను వాహన అద్దె కింద రూ. 61 లక్షలు తీసుకున్నారు. ఈ నిధులపై అభ్యంతం వ్యక్తం చేసిన ఆడిట్ విభాగం...న్యాయ నిపుణుల సూచనల మేరకు ఆమెపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. స్మితా సభర్వాల్ తీసుకున్న కారు టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు. ఎల్లో ప్లేట్ వాహనం కూడా కాదు. ఈ వాహనం ప్రైవేటు వ్యక్తిగత వాహనం. పవన్‌కుమార్ పేరిట ఉన్నట్లు ఆడిట్ విచారణలో తేలింది. సీఎంవో ఉన్న సమయంలో స్మితా సభర్వాల్ కార్యాలయం నుంచి ప్రతి నెలా వాహనం అద్దె రశీదులు రావడంతో వర్సిటీ యాజమాన్యం డబ్బులు చెల్లించినట్లు తేల్చింది.ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ పని తీరుపై తీవ్రమైన విమర్శలు వచ్చాయి. ఇటీవల జరిపిన విచారణలో కొన్ని అవకతవకలు జరిగినట్టు తేలాయి. అందులో స్మిత సబర్వాల్ అద్దె కారు వ్యవహారం కూడా ఉంది. స్మితా సభర్వాల్ వాహనం అద్దెపై ఆడిట్ అభ్యంతరం చేయడం నిజమేనని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ తెలిపారు.ఏజీ ఆడిట్ ఆధారంగా అంతర్గత విచారణ జరిపించామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని విశ్వవిద్యాలయం పాలకవర్గం దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో దీనిపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. దీనిపై సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించనున్నామని వర్సిటీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం, న్యాయ నిపుణుల సూచనల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నాయి.యూనివర్శిటీ అడిటింగ్ లో స్మితాసబర్వాల్ కు సంబంధించిన ఓ విషయం బయటపడింది. స్మితా సబర్వాల్ నెలకు రూ.63 వేలు వాహన అలెవెన్స్ తీసుకున్నట్లు అడిట్ అధికారులు గుర్తించారు. యూనివర్శిటీ నుంచి వెహికల్ అలవెన్స్ కింద మొత్తం 90 నెలలకు రూ.61 లక్షలు తీసుకోవడంపై ఆడిట్ అధికారుల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై యూనివర్సిటీ బోర్డు మీటింగ్?లో అధికారులు చర్చించారు. స్మితా సబర్వాల్ వర్సిటీ నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి రాబట్టాలని బోర్డు మీటింగ్ లో నిర్ణయించినట్లు సమాచారం.ఈ విషయంపై ప్రభుత్వానికి రెండు మూడు రోజుల్లో పూర్తి నివేదిక అందించనున్నారు. అనంతరం స్మితా సబర్వాల్? కు నోటీసులు జారీ చేసి నిధులు తిరిగి రాబట్టాలని వర్సిటీ అధికారులు యోచిస్తోన్నట్లు తెలుస్తోంది.

## విలేఖరి ముసుగులో

# రియల్ ఎస్టేట్ ముసుగు లో ఘరానా మోసం

- రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎల్లయ్య,విలేఖరి రాజు,పై కేసు నమోదు
- పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి

**షణ్ముఖ వెలుగు పెబ్బేరు మండల ప్రతినిధి మార్చి 20:** అక్రమాలకు పాల్పడుతూ అమాయకుల నుంచి లక్షల రూపాయల దోచుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి గోనేల ఎల్లయ్య మరియు విలేకరిగా పనిచేస్తున్న బొడ్డుపల్లి రాజు(విలేఖరి) అను వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపారు

పెబ్బేరు పట్టణంలోని సర్వే నెంబర్ 369 లో తమకు సంబంధం లేని పలు ప్లాట్లపై తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి పలువురికి విక్రయించి మోసం చేసిన వ్యక్తులపై గద్వాల జిల్లా ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్య కులానికి చెందిన కళ్యాణ్ కుమార్ తండ్రి నాగిశెట్టి ఫిర్యాదు చేయడంతో పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు విచారణ జరిపినట్లు తెలిపారు. ముఖ్యంగా భూములు,ప్లాట్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత పత్రాలు సక్రమంగా వున్నదీ లేనిది క్షేత్రస్థాయిలో కి వెళ్లి పరిశీలించుకోవాలని సూచించారు ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులు/భూమి యాజమానులు ప్లాట్ల అభివృద్ధి పేరుతో ఫైనాన్షియర్ ల నుండి డబ్బు తీసుకొని ఫైనాన్సర్లకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అదే ప్లాట్లను మరొకరికి జీపీఏ చేసి డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. పెబ్బేరు పట్టణంలో మరియు ఇతర గ్రామాల్లో ఎవరైనా బాధితులు ఉన్నా ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపారు




# ఒకే దేశం ఒకే ఎన్నిక తోనే దేశానికి మేలు

**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి మార్చి 20:** ఒకే దేశం ఒకే ఎన్నిక పై ప్రజలకు అవగాహన కల్పించాలని బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక పై ఆలేరు మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రాల్లో తరచూ జరిగే ఎన్నికలతో ప్రజాధనం దుర్వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పర్చాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి కోసం ప్రధాని మోడీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని దేశం ఆర్థిక పురోగతి సాధించాలంటే కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలలో ఒకే సారి ఎన్నికలు జరగడం ఎంతో మేలన్నారు. 1967 వరకు జమిలి ఎన్నికలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటును రద్దు చేయడంతో ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రాల్లో వేరు వేరుగా ఎన్నికలు జరగడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందడంలో జాప్యం ఏర్పడిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల శాఖ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి గౌడ్, జిల్లా కౌన్సిల్ నెంబర్ బోగ శ్రీనివాస్, ఒకే దేశం ఒకే ఎన్నిక మండల కన్వీనర్ బైరి మహేందర్ గౌడ్, శేషత్వ అమరేందర్, జిల్లా యువ మోర్చా అధికార ప్రతినిధి తెరల శంకర్, కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి తండా ప్రశాంత్, ఉపాధ్యక్షులు సుదగాని సురేష్, కంతి రవి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు అర్చన, సీనియర్ నాయకులు ములుగు రాజు, కటికె వెంకటేష్, బూత్ అధ్యక్షులు కాంద్రాజు శ్రీను, వడ్డేపల్లి కిషన్, గడ్డం సందీప్, వాసు, శ్యామల శ్రీకాంత్, గాజరాజుల శంకర్, గాజుల సారయ్య, గంధం కృష్ణమూర్తి, శ్రీకాంత్, కిషోర్, శివ తదితరులు పాల్గొన్నారు.



## గుండంపల్లి లో ఉచిత పశు వైద్య శిబిరం



**షణ్ముఖ వెలుగు న్యూస్ మల్లాపూర్ ప్రతినిధి మార్చి 20 :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ మల్లాపూర్ మండలంలోని గుండం పల్లి గ్రామంలో గురువారం మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆవులు,గేదెలకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు మరియు దూడలకు నట్టల నివారణ మందులు పంపిణి చేయడం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కోరుట్ల నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ రైతులందరికీ ఉపయోగపడే ఇలాంటి వైద్య శిబిరాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమము లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడ్పుల పుష్పలత, ఉపాధ్యక్షులు ఎత్తడి నారాయణ రెడ్డి, పశు వైద్యాధికారి డాక్టర్ జి. అశోక్, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సురేష్, డాక్టర్ డి.వెంకటేష్ ,డాక్టర్ జె.వెంకటేష్, కళాశాల విద్యార్థులు, పశువైద్య సిబ్బంది ఇక్బాల్ రవీందర్,రవి సాయన్న,వైద్యులు అచ్చే శ్రీనివాస్, త్రైసిన్ సిబ్బంది, గ్రామస్థులు, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా హుస్సేన్ నగర్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు






**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ మండల ప్రతినిధి మార్చి 20:** మల్లాపూర్ మండలంలోని హుస్సేన్ నగర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆట, పాటలు నృత్యాలలో ఉర్రూతలూగించారు. ప్రధానోపాధ్యాయులు కస్తూరి భాగ్యలక్ష్మి ప్రసంగిస్తూ పాఠశాల విద్యార్థులు భాష లోపల ఇబ్బందులు ఎదురవుతున్నా కానీ చదువు లోపల వెనుకబాటు తనం అనేది లేదని, విద్యార్థులు మంచిచదువు నేర్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయి కి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం బదిలీపై వెళ్లిన సతీష్ ను ఘనంగా సన్మానించి మెమొంటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో టిజియుయస్ జిల్లా శాఖ అధ్యక్షులు నునావత్ రాజు, టిఆర్టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జంగా గంగాధర్, ఉపాధ్యాయులు ముజాబీర్, ప్రవీణ, కీర్తన,శ్రీనివాస్, గంగాధర్, సరిత, అంగన్వాడి టీచర్ జ్యోతి గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రాయితీపై యంత్రాలు



**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ టౌన్ ప్రతినిధి మార్చి 20:** వ్యవసాయ యాంత్రికరణ ఉప పథకం ( ఎస్ఎంఏఎం) కింద రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందించుటకు మహిళా రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని గురువారం హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 2024-25 ఆర్థిక సంవత్సరంలో 50 శాతం పై సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలు వచ్చాయన్నారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలో హుజురాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణ వంక, సైదాపూర్ మండలాల్లో బ్యాటరీ స్ప్రేయర్స్ - 32, పవర్ స్ప్రేయర్స్ -32, రోటోవేటర్స్ -20 మరియు (డిస్క్ హార్రోస్/కల్టి వేటర్స్/ఎంబి ప్లవ్/కేజ్ వీల్స్)-22 పనిముట్లు రాయితీపై ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆసక్తి ,అర్హత గల రైతులు వెంటనే దరఖాస్తు పత్రంతో ఒక ఫోటో, కొత్త పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ , ట్రాక్టర్ తో పని చేయు యంత్రాలకు ట్రాక్టర్ యొక్క రిజిస్ట్రేషన్ పత్రాలు జత చేసి ఆయా మండల వ్యవసాయ కార్యాలయాల్లో ఇవ్వాలని తెలిపారు.

## చలో జనగామ పోస్టర్ ఆవిష్కరణ



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి మార్చి 20:** జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న నామకరణం చేయాలని డిమాండ్ తో జనగామ చౌరస్తాలో నేడు తలపెట్టిన చలో జనగామ ఒక్క రోజు దీక్ష కు సంబంధించిన పోస్టర్ ను యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి బైరి మహేందర్ గౌడ్, నాయకులు సదానంద గౌడ్, దూసరి అంజయ్య, గౌడ్, బిమగాని నర్సింహులు, గౌడ్, దంతూరి వెంకటేష్, గౌడ్, దూసరి మురళీ గౌడ్, కోళ్ల నరేష్ గౌడ్, దూడల సాగర్, నల్లమాస కృష్ణ గౌడ్, బాల్నే వెంకటేష్ గౌడ్, చీకట్ల నర్సయ్య గౌడ్, చెక్కిళ్ళ క్రాంతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస్ పథకం ఈ డబ్ల్యూఎస్ వారికి వర్తింపజేయాలి

మండల రెడ్డి సంఘం అధ్యక్షులు గుండాడి వెంకట్ రెడ్డి



**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి మార్చి 20:** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నిరుద్యోగ యువత కోసం చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకాన్ని కులాలతో సంబంధం లేకుండా పేదరికమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాస్ పథకం అమలు చేయాలని ఎల్లారెడ్డి పేట మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాడి వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అగ్రవర్ణ పేద నిరుద్యోగ యువతకు కూడా రాజీవ్ యువ వికాస్ పథకంలో అవకాశం కల్పించాలని సూచించారు. ఈ పథకం కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక పరిస్థితుల ఆధారంగా అగ్రవర్ణ కులాల్లోని పేదలకు కూడా వర్తింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## అంకెల గారడీ మోసపూరిత తెలంగాణ బడ్జెట్

...బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి మార్చి 20:** తెలంగాణ బడ్జెట్ ప్రజలను మోసం చేసే విధంగా ఉందని బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు బడ్జెట్ కేటాయించలేదని, హామీల ఎగనామం కు ఎత్తుగడ గా భావించొచ్చని అభిప్రాయపడ్డారు. వృద్ధుల పింఛన్, గృహలక్ష్మి, కల్యాణ లక్ష్మి తదితర హామీలతో పాటు కొత్త రేషన్ కార్డ్ లు, రేషన్ లో సన్న బియ్యం, మహిళలకు స్కూటీ, నిరుద్యోగ భృతి, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ ఉద్యోగస్తుల డీఏ, రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్, వికలాంగుల పింఛన్లు, ఆశా వర్కర్ల, అంగన్ వాడీల జీతాల పెంపుదల, బోయ లను ఎస్టి జాబితాలో చేర్చడం, ఇందిరమ్మ ఇండ్లు, సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగస్థులను పర్మినెంట్ చేస్తామన్న తదితర హామీలు పత్తాలేకుండా పోయాయని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం అప్పు చేసింది దానికి వడ్డీ కడుతున్నాం అంటూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ సంవత్సర కాలంలో 50 వేల కోట్లు దాటి అప్పు చేసిందని, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందు దొందే అని మరోసారి నిరూపితమైందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ భవిష్యత్తు మొత్తం అంధకారమే అన్నది తెలంగాణ ప్రజలకు అర్థమయ్యింది అని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బిజెపి పార్టీ అధికారంలోకి వస్తేనే తప్ప మరో మార్గం లేదనే అభిప్రాయంలో ప్రజలు ఉన్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి పార్టీ తమ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## బీసీ డిక్లరేషన్,ఎస్సీ వర్గీకరణ పట్ల హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు



**షణ్ముఖ వెలుగు శ్రీ రంగాపురం మండల ప్రతినిధి మార్చి 20:** శ్రీ రంగాపురం మండల కేంద్రంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో బీసీ కులగణన మరియు ఎస్సీ వర్గీకరణ బిల్లులు అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు . ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల గణన చేపట్టారని, బీసీ కుల గణన బిల్లు ద్వారా విద్య సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ కలిగే విధంగా చేకూర్చడం,అలాగే 30 ఏళ్ల నుంచి జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటం ఇన్నాళ్లకు ఫలించిందని వారు తెలిపారు.. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కుమ్మరి గోవింద్,కంబాళాపూర్ మాజీ ఎంపిటిసి ఎల్ల స్వామి, మండల ఉపాధ్యక్షులు వెంకటేష్ సాగర్,వర్కింగ్ ప్రెసిడెంట్ రామచందర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్ యాదవ్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## భీమారం మండల కేంద్రంలో విద్యార్థులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు పెన్నులు పంపిణీ



భీమవరం మండల కేంద్రంలో జిర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జడ్పి హెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్ లు పెన్నులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, జిర్డ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంగడి ఆనంద్ కుమార్, స్థానిక నాయకులు బక్కూరి నరేష్, చెక్క పల్లి సంజీవ్ శంకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్లి ధర్మయ్య, బీసీ నాయకులు ముంజ కిషన్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## పాత్రికేయుడిని పరామర్శించిన సీనియర్ పాత్రికేయులు కుందారపు ప్రభాకర్ ఆంజనేయులు



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి మండలం ప్రతినిధి మార్చి 20:** జగిత్యాల జిల్లా ఉమ్మడి మేడిపల్లి మండల పాత్రికేయులు బెజ్జారపు ప్రవీణ్ కుమార్ ఇటీవల కిడ్నీ సంబంధిత కరీంనగర్ లోని శ్రీ లలితా కిడ్నీ సెంటర్ లో జరగగా బాధిత కుటుంబాన్ని కోరుట్ల లోని వారి నివాసంలో సీనియర్ పాత్రికేయులు మామిడి ఆంజనేయులు, కుందారపు ప్రభాకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మన్నె గూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్షల ప్యాడ్ లు పెన్నులు పంపిణీ

**షణ్ముఖ వెలుగు మేడిపల్లి మండలం ప్రతినిధి మార్చి 20:** భీమారం మండలంలోని మన్నె గూడెం జడ్పీ హెచ్ ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు జిర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత అంగడి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు పెన్నులు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, జిర్డ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంగడి ఆనంద్ కుమార్, స్థానిక నాయకులు నర్సింగరావు గంట గంగా రాజం హరీష్, ఉమ్మడి రవి, బక్కూరి నరేష్, చెక్క పల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు



## వేములవాడ సిరిసిల్ల నియోజకవర్గ కో ఆర్డినేటర్ గా ఎండి అవేజ్



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి మార్చి 20:** ఏఐసిసి ఆదేశాల మేరకు జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు నిర్వహించడానికి వేములవాడ & సిరిసిల్ల నియోజకవర్గాలకు కో ఆర్డినేటర్ గా మన మెట్ పల్లి పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి. ఆవేజ్ ని పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నియమించిన సందర్భంగా వారికి శు భాకాంక్షలు తెలియజేశారు.

## కోమటి కొండాపూర్ లో విద్యార్థులకు వరల్డ్ స్పారో డే పై అవగాహన



**షణ్ముఖ వెలుగు ఇబ్రహీం పట్నం ప్రతినిధి మార్చి 20:** జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామంలో గురువారం మార్చి 20 పురస్కరించుకొని" ప్రపంచ పిచ్చుకలు దినోత్సవం పై మండల పరిషత్తు ప్రాథమికొన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమంను ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి నిర్వహించారు. సాంకేతిక అభివృద్ధిలో భాగంగా పెరిగిన కాలుష్యం, చరవాణుల వాడకం లో భాగంగా పెరిగిన రేడియేషన్ లు పిచ్చుకల మనుగడకు ముప్పు వాటిల్లడానికి ప్రధాన కారణాలు. నేటి ఏకో సిస్టంలో ప్రతి జీవికి ప్రాధాన్యత ఉంటుంది, కావున వాటి ప్రాణాలతో మనం ఆడుకుంటే మన ప్రాణాలతో ప్రకృతి ఆడుకుంటుంది. పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకల భాద్యతను గుర్తు చేస్తూ ఉన్న కొద్ది పక్షుల నైనా కాపాడుకోవడం కొరకు రానున్న వేసవిలో వాటికి ఆహారంగా గింజలు, దాహార్తి తీర్చడం కొరకు ఇంటి ముంగిట పాత్రల్లో నీళ్లు అందుబాటులో ఉంచాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పక్షుల గూళ్ళు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు సుధారాణి, విశాల్, నర్మద, రాణి, జ్యోష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ లో వర్గీకరణ బిల్లు ఆమెదం పట్ల సంబరాలు



**షణ్ముఖ వెలుగు ఇబ్రహీం పట్నం మండలం ప్రతినిధి మార్చి 20:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లో బి. సి రిజర్వేషన్ 42 శాతం అమలు మరియు ఎస్సి వర్గీకరణ బిల్లు అమలు అయినందున జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో ఇందిరమ్మ చౌక్ వద్ద బిసి బిల్లు ఆమోదం పట్ల బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకుని భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బిసి మంత్రి పొన్నం ప్రభాకర్,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం పట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ భోరిగాం రాజు, సహకార సంఘం చైర్మన్ అంకతి రాజన్న,మార్కెట్ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు గుడ శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్ళ దేవేందర్ ,మార్కెట్ డైరెక్టర్ గుమ్మల రమేష్,నాంపల్లి వెంకటాద్రి,బుర్రి ముత్యం ,క్యాతం తిరుపతి రెడ్డి, అమృత తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం

పాల్గొన్న మండల అధ్యక్షుడు మార్కెట్ చైర్మన్



**షణ్ముఖ వెలుగు బచ్చన్నపేట మండలం ప్రతినిధి మార్చి 20:** బిసి లకు 42 శాతం రిజర్వేషన్ పెంచి నందుకు సిఎం రేవంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి చిత్ర పటాలకు బిసి సెల్ మండల అధ్యక్షుడు దాచేపల్లి నరసింగరావు ఆధ్వర్యంలో బచ్చన్నపేట మండల కేంద్రంలో పాలాభిషేకం చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి మాట్లాడుతూ ఇంతటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి, చేర్యాల మార్కెట్ చైర్మన్ నల్ల నాగుల శ్వేత వెంకన్న, మాజీ చైర్మన్ మాసపేట రవీందర్ రెడ్డి కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పిన్నింటి నారాయణ రెడ్డి,కొడవటూర్ చైర్మన్ మల్ల రెడ్డి, నియోజక వర్గ కిసాన్ కో ఆర్డినేటర్ జంగిటి నరేష్, నాయకులు జంగిటి విద్యా నాథ్,అరవింద్ రెడ్డి, జిల్లా సందీప్, ఇజ్జగిరి రాములు, జంగిడి సిద్ధులు,హరికృష్ణ, కర్ర నరేష్, పెద్దపాటి కరుణాకర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దు హరీష్, నల్ల మహేందర్,కురాకుల రవి, అఖిల్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి దిశగా కొత్తపల్లి హనుమాన్ జంక్షన్







**షణ్ముఖ వెలుగు జమ్మికుంట ప్రతినిధి మార్చి 20:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి 18 వ వార్డు లోని హనుమాన్ జంక్షన్ లో గురువారం నాడు జంక్షన్ నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ ఆదేశాల మేరకు జమ్మికుంట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీధర్ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ ప్రదీప్ మున్సిపల్ ఏఇ నరేష్ మార్కింగ్ చేశారు. హనుమాన్ జంక్షన్ కొరకు గత పాలకవర్గం 25 లక్షల రూపాయలు కేటాయించి టెండర్లు పూర్తి చేయగా ప్లానింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో కమిషనర్ ఆయాజ్ అభివృద్ధి పనులు ఆలస్యం కాకూడదని అధికారులతో గురువారం మార్కింగ్ చేయించి కాంట్రాక్టర్ ను పనులను ప్రారంభించాలని ఆదేశించారు . జమ్మికుంట మున్సిపల్ ఫండ్స్ సరిపోనట్లయితే మున్సిపల్ ప్రత్యేక అధికారి అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అదనపు నిధులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారని కమిషనర్ ఎండి ఆయాజ్ తెలియజేశారు.

## నూతన తహసీల్దార్ ను కలిసిన కాంగ్రెస్,బిఆర్ఎస్, రేషన్ డీలర్ల సంఘం నాయకులు









**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి మార్చి 20:** ఎల్లారెడ్డి పేట నూతన తహసీల్దార్ గా బదిలీపై వచ్చి విధుల్లో చేసిన నూతన తహసీల్దార్ డి.సుజాత ను మండలములోని కాంగ్రెస్ బిఆర్ ఎస్ నాయకులు, మండల రేషన్ డీలర్ల సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు. ఎల్లారెడ్డి పేట లో పనిచేసిన తహసీల్దార్ బోయిని రామచంద్రం జిల్లా కలెక్టర్ కార్యాలయం డి సెక్షన్ సూపరింటెండెంట్ గా బదిలీ కాగా వేముల వాడ రూరల్ మండల తహసీల్దార్ గా పని చేసిన డి సుజాత బదిలీపై ఎల్లారెడ్డి పేట మండల తహసీల్దార్ గా విధుల్లో చేరారు.

## ఒకే దేశం ఒకే ఎన్నిక కార్యశాల పై బిజెపి కార్యకర్తలకు అవగాహన

**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి మార్చి 20:** ఒకే దేశం ఒకే ఎన్నిక కార్యాశాల ను భారతీయ జనతా పార్టీ ఎల్లారెడ్డి పేట మండల శాఖ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పేటలో బిజెపి కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ హాజరై మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ఎన్నిక ద్వారా భారతదేశంలో ఎన్నికల వ్యయాన్ని తగ్గిస్తుందని, భారత దేశం అభివృద్ధి పథంలో ముందుకు పయనిస్తోందని పరిపాలన స్థిరత్వం ,పాలసీల అమలుకు అంతరాయం ఉండకుండా వుంటుందని తెలిపారు. దేశ ఆర్థిక వృద్ధి తో పాటు ఓటింగ్ శాతం పెంచుకోవడం, ఆర్థిక నిర్మాణ మైన సంస్కరణలు, ఎన్నికల ఖర్చులలో అవినీతిని తగ్గిస్తుందని తెలిపారు.ఒకే దేశం ఒకే ఎన్నిక ద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందనీ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలకు వివరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో చందుపట్ల లక్ష్మారెడ్డి, మద్దుల బుగ్గారెడ్డి, కంచర్ల పరుశరాములు, కోనేటి సాయిలు, పూర్ణిమ, స్రవంతి, సంగీత, నంది నరేష్, శరత్ రెడ్డి ,సత్యం రెడ్డి, గణేష్, యాదగిరి, సోము కుమార్ గడ్డం రవి, కృష్ణ హరి ,వంగల రాజు, బొమ్మరి స్వామి, కొండాపురం సత్యం రెడ్డి, కిరణ్ నాయక్ ,శ్రీశైలం, మేడి శెట్టి బాలయ్య, ఆంజనేయులు, రంజిత్, బాపు రెడ్డి, సంజీవరెడ్డి, ప్రదీప్ రెడ్డి, గాల్ రెడ్డి, లక్ష్మణ్, ప్రశాంత్ ఎలేందర్, బాల గౌడ్ దయాకర్, మానుక బాబు సాగర్ లతో పాటు జిల్లా నాయకులు, మండల నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి మార్చి 20:** సూరారం డివిజన్ షాపూర్ నగర్ ప్రధాన రహదారి లోని ఎం.జె గార్డెన్స్ లో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన "దావత్ - ఇ - ఇఫ్తార్" కార్యక్రమానికి మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ మరియు బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు లు ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక అని మతాలకతీతంగా ఇతరులు ఇఫ్తార్ విందులో పాల్గొనడం సోదర భావాన్ని పెంచి లౌకిక విలువలను కాపాడుతాయని ముస్లిం సోదరులు నెలరోజుల పాటు అత్యంత కఠిన నియమాలతో ఆ అల్లాను ప్రార్థిస్తారని, అల్లా దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూర తినిపిస్తూ ఉపవాసాన్ని విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, మతపెద్దలు, మైనార్టీ నాయకులు, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.





## పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**షణ్ముఖ వెలుగు, ఇబ్రహీం పట్నం మండలం ప్రతినిధి మార్చి 20:** జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండలంలో గల మోడల్ స్కూల్ ఇబ్రహీంపట్నం , జడ్పీ హెచ్ ఎస్ గోధూర్ పాఠశాలలో నేటి నుండి జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టుగా మండల విద్యాధికారి బండారి మధు తెలియజేశారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా మాట్లాడుతూ మోడల్ పాఠశాలలో 226 మంది విద్యార్థులు గోధూర్ పాఠశాలలో 91 మంది విద్యార్థులు పరీక్షల రాయబోతునారని , వారికి కావలసిన త్రాగునీరు ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫ్యాన్లు లైట్లు అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లుగా పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించినట్లు గా తెలియజేశారు. కావున విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఇట్టి విషయాన్ని గమనించి పిల్లలను సకాలంలో పరీక్షా కేంద్రంలో పంపించాలని విద్యార్థిని విద్యార్థులు కానీ విధులు నిర్వహించేటువంటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కానీ ఎవరు కూడా మొబైల్ ఫోన్స్ మరియు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లో కి తీసుకు రాకూడదని తెలియజేశారు. ఈ విషయాలను తల్లిదండ్రులు గమనించి పరీక్షా కేంద్రాల పరిసరాలలో ఉండకూడదని తెలియజేశారు



# వన్ నేషన్ , వన్ ఎలక్షన్ విధానం 1967లోనే ఉంది





- దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలతో అనేక ప్రయోజనాలు
- దేశ భవిష్యత్తు కోసం నేడు జమిలి ఎన్నికలే శ్రేయస్కరం...
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...


**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు మార్చి 20**: వన్ నేషన్ , వన్ ఎలక్షన్ విధానం (జమిలి ఎన్నికల) 1967 లోనే ఉందని , ఆ రోజున దేశవ్యాప్తంగా లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయని , జమిలి ఎన్నిక విధానం కొత్తేమీ కాదని ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భవిష్యత్తు కోసం జమిలి ఎన్నికలే శ్రేయస్కరమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం రోజున జమ్మికుంట బిజెపి శాఖ ఆధ్వర్యంలో వన్ నేషన్ , వన్ ఎలక్షన్ వర్క్ షాప్ ప్రోగ్రాం జరిగింది. ఈ వర్క్ షాపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వన్ నేషన్ , వన్ ఎలక్షన్ తో ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు వస్తాయని , లోక్ సభ, అసెంబ్లీలకు కలిపి దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే భారీగా ప్రభుత్వ ధన వృధా ఖర్చులు తగ్గుతాయన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే సమయం ఆదాతో పాటు పదేపదే పలుమార్లు ఎన్నికలు జరగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలకు తరుచూ ఎన్నికల కోడ్ అడ్డంగా మారడం కూడా తగ్గుతుందన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటర్ల పోలింగ్ శాతం కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. ముఖ్యంగా స్వాతంత్రం వచ్చిన తర్వాత 1967 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు, లోక్ సభకు ఒకేసారి ఎన్నికలు జరిగేవని, ఆ తర్వాత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ లు రద్దు కావడం, 1970 లో ఏడాది ముందే లోక్ సభ రద్దు చేయడంతో ఈ విధానం మారిపోయిందన్నారు. 1983లో ఎన్నికల కమిషన్ మరోసారి జమిలి ఎన్నికల ప్రతిపాదనను తెరపైకి తెచ్చిందని , 1999లో లా కమిషన్ నివేదిక ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని లేవనెత్తిన అది ఆచరణలోకి రాలేదన్నారు. రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్ సభ ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా ఖర్చులు చేస్తుందని , వేర్వేరు సమయాల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల జరుగుతున్న భారీ ఖర్చులను అరికట్టడానికి, ప్రజా ధనాన్ని వృధా కాకుండా, ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు చేపట్టడానికి జమిలి ఎన్నికలను తీసుకురావాల్సిన అవసరం ఉందని మోడీ ప్రభుత్వం భావించిందన్నారు. ఆ దిశగానే 2016 లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జమిలి ఎన్నికల ఆలోచనలను ప్రతిపాదించగా, దీనిపై 2017లో నీతి ఆయోగ్ కసరత్తు చేసిందన్నారు. 2022 డిసెంబర్లో జెమిని ఎన్నికలపై లా కమిషన్ వివిధ పార్టీలు, ఈసీ, అధికారులు విద్యావేత్తలు, నిపుణుల, అభిప్రాయాలను ఆహ్వానించిందన్నారు. ఆ తదనంతరం కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని కూడా ఏర్పాటు చేసిందన్నారు. దీనిపై కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక కూడా అందజేసిందన్నారు. ప్రధానంగా ఈ నివేదికలో లోక్ సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలు, చట్టపరమైన మార్పులను సూచించిందని , అలాగే ఈ జమిలి ఎన్నికల విధానం ద్వారా ఎన్నికల నిర్వహణ ఖర్చులు తగ్గించి, అభివృద్ధి, సామాజిక



ఐక్యతను పెంపొందించవచ్చుని కమిటీ పేర్కొందన్నారు. కమిటీ నివేదికను కేంద్ర కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. ఈ ప్రతిపాదన చట్టంగా మారితే, లోక్ సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయని, . అనంతరం 100 రోజుల్లోగా నగర, పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే యోచన ఉంద న్నారు.కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి పార్లమెంట్ ఆమోదంతో పాటు, కొన్ని రాజ్యాంగ సవరణలకు రాష్ట్రాల అసెంబ్లీ లు కూడా ఆమోదం తెలపాలని, ఈ ప్రతిపాదనపై రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, కొన్ని పార్టీలు జమిలి, ఎన్నికలపై మద్దతు తెలుపుతుంటే, మరికొన్ని వ్యతిరేకిస్తు, పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నాయన్నారు. జమిలి ఎన్నికలపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు , వన్ నేషన్ వన్ ఎలక్షన్ జమ్మికుంట పట్టణ కన్వీనర్ ఆకుల రాజేందర్, కో కన్వీనర్ జీడి మల్లేష్ , జడల శ్రీనివాస్, కోరే రవీందర్, కేతు పెల్లి రమాదేవి , పోలింగ్ బూత్ అధ్యక్షులు, కుల సంఘం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తాను మరణించినా నేత్రాలు సజీవం






**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు మార్చి 20**: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన కిన్నెర మల్లయ్య (56) బుధవారం రాత్రి మాన కొండూరు మండలం శంషాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం లో మృతి చెందారు.కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు మృతుని నేత్రాలను ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి కి దానం చేసారు. తన తండ్రి చనిపోయినా మరొకరి జీవితానికి నేత్రాలు ఉపయోగపడాలనే ఆశయం తో తన తండ్రి నేత్రాలను దానం చేసినట్లు మల్లయ్య కొడుకు అనిల్ పేర్కొన్నారు. అనిల్ చేసిన ఈ గొప్ప కార్యక్రమం అవయవ దానం స్ఫూర్తిని కలిగిస్తుందని గ్రామస్తులు అభినందించారు. గురువారం జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో గ్రామస్థులు, బిజెపి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనిల్ బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గా వ్యవహరిస్తున్నారు.

## స్నేహం ముసుగులో ఫ్రెండ్స్‌తో అత్యాచారం

**నల్గొండ :** స్నేహం ముసుగులో మోసాలు చేస్తారని విన్నాం కానీ, మరీ ఇంత నీచానికి దిగజారిపోతారని ఇప్పుడే తెలుస్తోంది. అసలు ఏ మాత్రం భయం లేకుండా, తప్పు చేస్తామనే ఇంకితం లేకుండా ఓ ఆడపిల్ల జీవితం నాశనం చేసింది మరో యువతి. స్నేహం పేరుగా మంచిగా నటించి, ఓ రోజు ఫ్రెండ్‌ను ఇంటికి పిలిచింది. పార్టీ చేసుకుందామంటూ ఆమెతో బలవంతంగా మద్యం తాగించి, మత్తు ఎక్కిన తర్వాత తన ప్రియుడితో ఆమెపై అత్యాచరం చేయించింది. ఆ దారుణాన్ని వీడియో కూడా తీసింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. హుజూర్ నగర్ పట్టణానికి చెందిన ఓ యువతిపై ఆమె స్నేహితురాలు దారుణానికి ఒడిగట్టింది.పార్టీ చేసుకుందామని ఇంటికి పిలిచి, బలవంతంగా మద్యం తాగించి తన ప్రియుడు ప్రమోద్‌తో ఆమె అత్యాచారం చేయించింది. ఆ దృశ్యాలను వీడియో తీసి తర్వాత బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడింది. బాధితురాలని హుజూరాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపానికి తీసుకెళ్లింది. మళ్లీ మద్యం తాగించి ఈ సారి ప్రమోద్‌తో పాటు అతని స్నేహితుడు హరీశ్ కూడా అత్యాచారానికి పాల్పడ్డాడు. మత్తులో ఉన్న సదరు యువతిపై ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ సమయంలోనే బాధితురాలి ప్రైవేటు వీడియోలు, ఫొటోలు తీశారు.విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తామని బెదిరించి ఇంటి వద్ద వదిలిపెట్టారు. అయితే ప్రైవేటు వీడియోలు తీసిన కామాంధులు బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించారు. తాము ఫోన్ చేసి పిలిచినప్పుడల్లా రావాలని, అడిగినంత డబ్బు ఇవ్వాలని బెదిరింపులకు దిగారు. రాకపోతే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతామంటూ భయపెట్టారు. వారి బెదిరింపులతో విసిగిపోయిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇద్దరు యువకులు, వారికి సహకరించిన మరో యువతిపైనా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


## కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ అమలు



**కరీంనగర్ :** కరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద నేటి నుండి ఏప్రిల్ నెల 4వ తేదీ వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్, యాక్ట్ -2023 భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, అమలులో వుంటుందని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబందించిన ఉత్తుర్వులు గురువారంనాడు వెలువడ్డాయి. ఈ ఉత్తుర్వుల ప్రకారం పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాలకు ఐదు వందల మీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, మూసివేయాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని కరీంనగర్ పోలీసు కమిషనర్ తెలిపారు

# నిమిషానికి 90 వేలు

**హైదరాబాద్ :** కొంత కాలంగా వివాదాలకు కేంద్రంబిందువుగా ఉన్న బెట్టింగ్ యాప్స్ కేసులో పోలీసుల విచారణకు యాంకర్ విష్ణు ప్రియ హాజరయ్యారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ కోసం ఎంత వసూలు చేస్తున్నారో వివరించారు. ఈ క్రమంలో జరిగిన లావాదేవీల వివరాలను కూడా పోలీసుల ముందు ఉంచారు. ప్రజల ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌కు ఎంత ఖర్చు చేస్తున్నారో తెలిస్తే షాక్ అవుతారు. ఇదే విషయంపై పంజాగుట్ట పోలీసులకు యాంకర్ విష్ణుప్రియ షాకింగ్ నిజాలు చెప్పారు. ఆ వివరాలు తెలుసుకున్న పోలీసులే ఖంగుతున్నారు. ఇంతలా ఖర్చు చేస్తున్నారంటే వాళ్లు ఏ స్థాయిలో దందాలు చేస్తున్నారో అర్థం చేసుకోవాలని ప్రజలకు హితవు పలుకుతున్నారు. ప్రజలను నిట్టనిలువునా దోచేస్తూ వారి ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్ యాప్స్ భరతం పట్టేందుకు కంకణం కట్టుకున్న పోలీసులు కీలక విషయాలు రాబడుతున్నారు. ఇప్పటికే 11 మంది సెలబ్రెటీలకు నోటీసులు జారీ చేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేసిన కేసులో నోటీసులు అందుకున్న వారంతా ఒక్కొక్కరుగా పోలీసు విచారణకు వస్తున్నారు. తాజాగా యాంకర్ విష్ణుప్రియ పోలీసు విచారణకు హాజరయ్యారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు తన లాయర్‌తో కలసి వచ్చిన విష్ణుప్రియ పోలీసులు అడిగిన సమాచారం అందజేశారు. ఆమెను కృశ్చన్ చేసిన ఖాకీలు స్టేట్?మెంట్? రికార్డు




చేశారు. ఈ సందర్భంగా కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. తాను 15 బెట్టింగ్ యాప్స ప్రమోట్ చేసినట్టు విష్ణుప్రియ పోలీసులకు వివరించారు. నిమిషం వ్యవధితో చేసే ఒక్కో వీడియోకు రూ.90 వేల వరకు వసూలు చేసినట్టు పేర్కొన్నారు. దాదాపు మూడు గంటలకుపైగా సాగిన విచారణలో బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌లో భాగంగా భారీగా డబ్బులు వచ్చినట్టు విష్ణుప్రియ అంగీకరించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల వివరాలు వారికి అందజేశారు. కేసు దర్యాప్తులో భాగంగా మరింత లోతుగా విచారించేందుకు పోలీసులు ఆమె ఫోన్ కూడా సీజ్ చేశారని తెలుస్తోంది.

# విద్య రంగాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**బడ్జెట్ లో విద్య రంగానికి మొండి చేయి**

**కాంగ్రెస్ విద్యారంగానికి అరకోరా నిధులు**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్**

**జగిత్యాల :** విద్యారంగ పట్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం మేనని ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి మొహమ్మద్ అక్రమ్ మాలిక్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ముందు ఏఐఎస్ఎఫ్ నేతలు తలదించుకొని నిరసన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.57 %, 0. 2% నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తు శుద్ధి ఉందని తెలిసిందన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో డొల్లతనం కనిపిస్తుందన్నారు. కనీసం విద్యారంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్ ను కూడా విద్యారంగాని కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు .. రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15 % నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ గత సంవత్సరం ఈ సంవత్సరానికి 0.2 % మాత్రమే కేటాయించడం దారుణం అని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు, కేటాయించడం తగదన్నారు. పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫీజు రీయంబర్స్ గురించి ప్రస్థావన లేదని ఆయన విమర్శించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు. సుమారుగా 11,600 కోట్ల రూపాయలను కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పరిస్థితి ఏంటి. కస్తూరిబా ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం ఊసే లేదు డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు, స్వంత భవనాలు నిధులు లేవన్నారు. ఈ నిధులు విద్యా అభివృద్ధి కోసం కాదు ,విద్యా దారిద్ర్యానికి దారి తీస్తాయని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం



విద్యారంగానికి 30 % అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.. లేని పక్షణ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మంద రాకేష్, పట్టణ అధ్యక్షులు మహేష్ ,రూరల్ మండల అధ్యక్షులు అంకటి ప్రణయ్, పట్టణ నాయకులు సాయి చరణ్, జిల్లా సమితి సభ్యులు అరవింద్ మనోజ్, గర్ల్స్ విభాగం ప్రవళిక, సుష్మా, సింధూ, రవళి, జ్యోత్స్న ,అక్షయ, తన్మాయి, రష్మిక తదితరులు పాల్గొన్నారు...

## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు ఊరట



**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేసింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హరీష్‌రావుపై 2024 డిసెంబర్‌లో ఈ కేసు నమోదు అయింది. రాజకీయ కుట్రపూరితంగానే తనపై కేసు పెట్టారని హరీష్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. మొదట్లో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని చెబుతూ వచ్చిన హైకోర్టు ఇవాళ(20 మార్చి 2025) కీలక తీర్పు వెల్లడించింది. ఎలాంటి ఆధారాలు లేకుండా, కనీసం విచారణ చేయకుండానే పోలీసులు ఈఎఫ్ఐ ఫైల్ చేశారని కోర్టు తప్పుపట్టింది. సుదీర్ఘ వాదనల అనంతరం తుదితీర్పును వెలువరించింది.హరీష్ రావుపై నమోదైన కేసులో ఎలాంటి ఆధారాలు లేని అందుకే కొట్టేస్తున్నట్టు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు పెట్టడం సర్వసాధారమైపోయిందన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి హైకోర్టు గుణపాఠం నేర్పిందని అభిప్రాయపడ్డారు.